సోమవారం । 20 । అక్టోబర్ । 2025

దాడులు ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు



పత్రికా సేచ్ఛను హరించే విధంగా పాలకులు వ్యవహరించడం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు. ప్రజల పక్షాన నిలిచి, వాస్తవాలను వెలికితీసి, ప్రపంచానికి తెలియజేసే పత్రికలపై ప్రభుత్వాలు కక్ష సాధించే చర్యలు చేపట్టడం అమానుషమైన చర్య. పత్రికా స్వేచ్ఛను అణగదొక్కడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే అవుతుంది.

- డాక్టర్ గూడూరి శ్రీనివాస్, రాజమహేంద్రవరం పార్లమెంటరీ ఇన్‌చార్జి, వైఎస్సార్ సీపీ

పత్రికా స్వేచ్ఛపై దాడి అప్రజాస్వామికం



నిజాలను నిర్భయంగా రాసే మీడియా గొంతు నొక్కడం ద్వారా తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవాలని కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. 'సాక్షి' కార్యాలయంలో సోదాలు, ఎడిటర్ ధనంజయ రెడ్డికి నోటీసులు అంటూ రోజుల తరబడి విధులకు ఆటంకం కలిగించడం సమంజసంగా లేదు. మీడియాను ఇబ్బంది పెట్టడం అనేది అప్రజాస్వామిక విధానం. మీడియాలో వచ్చే కథనాలపై ప్రభుత్వం వివరణ ఇవ్వాలే కానీ బెదిరింపులకు పాల్పడి అణచివేయాలని చూడడం మంచి పద్ధతి కాదు.

- విప్పర్తి వేణుగోపాలరావు, ఉమ్మడి తూర్పు గోదావరి జెడ్పీ చైర్మన్

మూల్యం చెల్లించుకుంటారు



పత్రికా స్వేచ్ఛ రాజ్యాంగం కల్పించిన హక్కు. 'సాక్షి' కార్యాలయంపై దాడులు, ఎడిటర్ ధనంజయరెడ్డి, విలేకర్లపై కేసులు అప్రజాస్వామికం. కూటమి ప్రభుత్వం త్వరలోనే తగిన మూల్యం చెల్లించుకుంటుంది. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ, పత్రికా స్వేచ్ఛను అణచివేస్తోంది. ప్రభుత్వ చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం. ఇప్పటికైనా తమ తప్పు తెలుసుకుని వేధింపులు ఆపాలి.

- తలారి వెంకట్రావు, మాజీ ఎమ్మెల్యే, కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జి, వైఎస్సార్ సీపీ



న్యూస్‌రీల్

లోవలో భక్తుల సందడి



అమ్మవారి దర్శనానికి క్యూలో వేచి ఉన్న భక్తులు

తుని రూరల్: తలుపులమ్మ అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులతో లోవ దేవస్థానంలో ఆదివారం సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 6 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, ఆలయ ఈఓ పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. పులిహోర, లడ్డూ ప్రసాద విక్రయాల ద్వారా రూ.1,07,550, పూజా టికెట్లకు రూ.68,270, కేశఖండన శాలకు రూ.6,880, వాహన పూజలకు రూ.4,980, కాటేజీలు, పొంగలి షెడ్లు, వసతి గదుల అద్దెలు రూ.53,812, విరాళాలు రూ.20,287 కలిపి మొత్తం రూ.2,61,779 ఆదాయం సమకూరిందని వివరించారు.

రత్నగిరికి భక్తుల తాకిడి



క్యూలో కిక్కిరిసిన భక్తులు

అన్నవరం: వరుసగా రెండు రోజులు సెలవులు రావడంతో సత్యదేవుని దర్శనానికి ఆదివారం వేలాదిగా భక్తులు తరలి వచ్చారు. దీంతో, స్వామివారి ఆలయం, ఆ ప్రాంగణం, వ్రత, విశ్రాంతి మండపాలు కిక్కిరిసిపోయాయి. సుమారు 50 వేల మంది సత్యదేవుని దర్శించుకున్నారు. వ్రతాలు రెండు వేలు నిర్వహించారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.50 లక్షల ఆదాయం సమకూరింది. నిత్యాన్నదాన పథకంలో ఐదు వేల మంది సత్యదేవుని అన్న ప్రసాదం స్వీకరించారు.

రూ.50 వేల విరాళం



దాతలకు స్వామివారి చిత్రపటాన్ని అందిస్తున్న దేవస్థానం సిబ్బంది

కొత్తపేట: ఆత్రేయపురం మండలం వాడపల్లి వేంకటేశ్వరస్వామి వారి క్షేత్రంలో అన్నప్రసాద భవన నిర్మాణానికి తోట సూరిబాబు, నాగలక్ష్మి దంపతులు, కుటుంబ సభ్యులు (ఆలమూరు మండలం చొప్పెల్ల) రూ.50,116 విరాళం సమర్పించారు.

కడలిలోకి 1.67 లక్షల క్యూసెక్కులు

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి ఆదివారం 1,66,867 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. తూర్పు డెల్టాకు 2,100, మధ్య డెల్టాకు 1,800, పశ్చిమ డెల్టాకు 4 వేల క్యూసెక్కుల చొప్పున విడుదల చేశారు. బ్యారేజీ వద్ద 9.80, భద్రాచలం వద్ద 16.80 అడుగుల మేర నీటిమట్టాలు నమోదయ్యాయి.

విస్తారంగా వర్షాలు

ఐ.పోలవరం: ఆగ్నేయ బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తన ద్రోణి కారణంగా నాలుగు రోజుల పాటు వర్షాలు పడొచ్చని వాతావరణ శాఖ ప్రకటించింది. కోనసీమ జిల్లాలో శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం రాత్రి వరకూ అడపాదడపా వాన కురుస్తూనే ఉంది. అత్యధికంగా కపిలేశ్వరపురంలో 29.6 మిల్లీమీటర్ల వర్షం కురవగా, అత్యల్పంగా మామిడికుదురులో 2.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. మండలాల వారీగా పరిశీలిస్తే.. కపిలేశ్వరపురం 29.6, కె.గంగవరం 28.8, సఖినేటిపల్లి 26.8, అయినవిల్లి 25.6, రావులపాలెం 19.2, ఆత్రేయపురం 18.8, ఆలమూరు 16.2, ముమ్మిడివరం 14.2, అమలాపురం 12.8, ఐ.పోలవరం 10.8, రామచంద్రపురం 9.2, పి.గన్నవరం 9.2, మండపేట 7.4, రాజోలు 7, మలికిపురం 6.6, ఉప్పలగుప్తం 5.8, కొత్తపేట 5.4, కాట్రేనికోన 5, రాయవరం 3.2, అల్లవరం 2.8 మిల్లీమీటర్ల చొప్పున నమోదైంది.

పండగ పూటా.. పస్తులే..

- ఏడు నెలలుగా జీతాల్లేవు
- ఉద్యోగుల విలవిల
- ఐసీడీఎస్ అనుబంధ విభాగాల్లో దుస్థితి

కాకినాడ క్రైం: మహిళా, శిశు సంక్షేమ శాఖ (ఐసీడీఎస్) అనుబంధ విభాగాల్లో పని చేస్తున్న ఉద్యోగులకు పండగ పూటా పస్తులు తప్పడం లేదు. పోస్ట్ గ్రాడ్యుయేషన్ వంటి ఉన్నత చదువులు చదివి, ప్రభుత్వ ఒప్పంద ఉద్యోగాల్లో చేరి, గొడ్డు చాకిరీ చేస్తున్నా.. వారికి ప్రభుత్వం నెలల తరబడి జీతాలు చెల్లించడం లేదు. ఐసీడీఎస్‌కు అనుబంధంగా జిల్లా బాలల పరిరక్షణ విభాగం (డీపీయూ), శిశుగృహ, వన్‌స్టాప్ సెంటర్ (ఓఎస్‌సీ), డొమెస్టిక్ వయొలెన్స్ సెల్(డీవీసీ) స్త్రీలు, బాలలు, శిశువుల సంక్షేమం, సంరక్షణ కోసం పని చేస్తున్నాయి. జిల్లావ్యాప్తంగా ఈ విభాగాల్లో 40 మంది పని చేస్తున్నారు. వారికి ప్రభుత్వం మూడు నుంచి ఏడు నెలలుగా జీతాలు చెల్లించడం లేదు. దీంతో, దీపావళి పండగ వేళ పిల్లలు నాలుగు టపాసులు కొనమంటే చేతిలో చిల్లిగవ్వ లేక, నిస్సహాయంగా వారి ముఖాలు చూడాల్సి వస్తోందని ఆ ఉద్యోగులు ఆవేదన చెందుతున్నారు.



శిశుగృహ

ఈ విభాగం చిన్నారుల వసతి, సంక్షేమాన్ని పర్యవేక్షిస్తుంది. ఇందులో మొత్తం 12 మంది ఉద్యోగులున్నారు. వీరిలో మేనేజర్, వైద్యుడు, నర్సు, సోషల్ వర్కర్, చౌకీదారుతో పాటు ఆరుగురు ఆయాలుంటారు. నిర్లక్ష్యానికి గురైన శిశువులు, చెత్తకుప్పల్లో దొరికిన ఆడ శిశువులు, రోడ్లు, ఆసుపత్రుల్లో విడిచేసిన పిల్లలకు శిశుగృహ సాంత్వన. ఇక్కడి సిబ్బంది పూర్తి సేవా నిరతితో పని చేస్తుంటారు. ఎవరూ లేని అనాథ చిన్నారులను తమ కన్నబిడ్డల్లా చూసుకుంటారు. వారికి జీతాలు చెల్లించి నాలుగు నెలలైంది. వీరి బాధను కనీసం వినే నాథుడే లేదు.

డొమెస్టిక్ వయొలెన్స్ సెల్

గృహ హింసకు గురైన ప్రతి మహిళకు డొమెస్టిక్ వయొలెన్స్ సెల్ కొండంత బలాన్నిస్తుంది. ఇంటి నుంచి, తమ వారి నుంచి కూడా పొందలేని రక్షణను ఈ సెల్‌లో మహిళ పొందగలుగుతుంది. అక్కడి న్యాయనిపుణులు ఆమె సమస్యకు పరిష్కారం సూచిస్తారు. కష్టం నుంచి బయట పడేంత వరకూ ఆమెకు రక్షణగా నిలుస్తారు. ఈ విభాగంలో సోషల్ కౌన్సిలర్, లీగల్ కౌన్సిలర్, డీఈఓ, ఇద్దరు హోంగార్డులు పని చేస్తున్నారు. వీరిలో పోలీసులకు తప్ప మరెవ్వరికీ మూడు నెలలుగా జీతాల్లేవు. విధులకు రావడానికి కూడా వాహనంలో పెట్రోలు కూడా లేక ఇబ్బంది పడుతున్నామని వారు ఆవేదన చెందుతున్నారు.



తప్పిపోయిన వృద్ధురాలికి వన్‌స్టాప్ సెంటర్‌లో వసతి కల్పించి, కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న సిబ్బంది

వన్‌స్టాప్ సెంటర్

మహిళలు, బాలబాలికలు, మేజర్లు, మైనర్లు ఇలా ఎవరికైనా కష్టమొచ్చిందంటే వారికి కొండంత అండగా నిలుస్తోంది కాకినాడ జీజీహెచ్‌లోని సఖి వన్‌స్టాప్ సెంటర్. బాధితులను సంరక్షించి, తాత్కాలిక వసతి కల్పించి, అన్ని రకాలుగా రక్షణ కల్పిస్తున్నారు. వారి సంరక్షణ కోసం వన్‌స్టాప్ సెంటర్‌లో పోలీసులు, న్యాయ నిపుణులు కూడా పని చేస్తారు. రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ శైలజ ఇటీవల కాకినాడలో పర్యటించిన సందర్భంగా వన్‌స్టాప్ సెంటర్ సేవలను ప్రశంసించారు. ఈ సెంటర్‌కు కలెక్టర్ షణ్మోహన్ స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర అవార్డు అందజేశారు కూడా. ఈ సెంటర్‌లో ఒక అడ్మినిస్ట్రేటర్, పారా లీగల్ పర్సనల్, కౌన్సిలర్, ఐటీ పర్సన్‌తో పాటు కేసు వర్కర్లు ఇద్దరు, సెక్యూరిటీ గార్డులు,



హెల్పర్లు ముగ్గురు చొప్పున మొత్తం 12 మంది ఉన్నారు. వీరిలో ఏ ఒక్కరికీ ఏడు నెలలుగా జీతాలు చెల్లించడం లేదు. అధికారులు సిఫారసులు చేసినా ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల ప్రతిష్టంభన కొనసాగుతోంది. జీతాల విడుదలకు రిజర్వు బ్యాంకుకు సిఫారసు చేయాల్సి ఉండగా, ప్రభుత్వం ఆ పని ఇప్పటి వరకూ చేయడం లేదు. దీంతో, ఈ ఉద్యోగుల కంట కన్నీళ్లు తప్పడం లేదు.

బాలల పరిరక్షణ విభాగం

ఇందులో డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి (డీసీపీఓ), ముగ్గురు పీఓలు, ఒక కౌన్సిలర్, ఇద్దరు సోషల్ వర్కర్లు, ఒక డేటా ఎనలిస్టు, ఒక అకౌంటెంట్, ఒక ఏడీఈఓ, కింది స్థాయిలో అవుట్‌రీచ్ వర్కర్ (ఓఆర్‌డబ్ల్యూ) పని చేస్తుంటారు. రోడ్లపై తిరుగుతున్న బాలల నుంచి, చిన్నారులను చంకనెత్తుకొని భిక్షాటన చేస్తున్న వారి వరకూ.. పిల్లలకు ఎక్కడ ఏ కష్టమొచ్చినా వీరు అమాంతం వాలిపోతారు. బాలల సంరక్షణపై నిత్యం సమావేశాలు, అవగాహన సదస్సులు నిర్వహిస్తారు. బాలల హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం రోడ్లు పట్టి, ఎండనక వాననక పాటు పడతారు. ఆ సేవలకు మంత్రముగ్ధులైన కలెక్టరే వారిని ఘనంగా సత్కరించారు. ఇటువంటి కీలక శాఖలోని సిబ్బందికి నాలుగు నెలలుగా



బాలుడితో కలిసి భిక్షాటన చేస్తున్న మహిళకు కౌన్సెలింగ్ ఇస్తున్న సిబ్బంది

ప్రభుత్వం జీతాలు ఇవ్వడం లేదు. దీంతో, ఇన్నాళ్లుగా వారి ఇళ్లల్లో ఏ పండగకూ సందడి లేకుండా పోయింది. వీరికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి జీతాలు చెల్లించాలి. అయితే, కేంద్రం నుంచి సొమ్ము రాలేదంటూ రాష్ట్ర ప్రభుత్వం తప్పించుకుంటోంది. బడ్జెట్ విడుదల కాలేదనే సాకుతో మిన్నకుంటోంది.

నేడు పీజీఆర్ఎస్ రద్దు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని దీపావళి పండగను పురస్కరించుకుని ఈ వారం రద్దు చేశారు. జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి ఆదివారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకుని, ప్రమాదాల బారిన పడకుండా పండగ నిర్వహించుకోవాలని సూచించారు. జిల్లా ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండగ ప్రతి ఇంట్లో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. కాలుష్యం లేని, ఆనందకరమైన దీపావళిని ప్రతి ఒక్కరూ నిర్వహించుకోవాలని కోరారు. హరిత టపాసులకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు.

ఉత్సాహంగా 'చెకుముకి' పోటీలు



చెకుముకి పరీక్ష రాస్తున్న విద్యార్థులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహించినట్లు జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె.భీమయ్య, ఎస్.రవిబాబు ఆదివారం తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాల్లోనూ వివిధ పాఠశాలల్లో ఈ సంబరాలు నిర్వహించామన్నారు.

నాలుగు స్థాయిల్లో ఈ పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. మొదటి స్థాయిలో పాఠశాల స్థాయి సంబరాలకు 8, 9, 10 తరగతుల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారని తెలిపారు. నవంబర్ 1న మండల, పట్టణ స్థాయిల్లో చెకుముకి పరీక్ష జరుగుతుందని, పాఠశాల స్థాయి విజేతలు ఈ పోటీల్లో పాల్గొనాలని సూచించారు.

కార్తికం.. భక్త్యుత్సవం



విశ్రాంతి షెడ్డులో వ్రతాలు, దర్శనం, ప్రసాదం కౌంటర్లకు ఏర్పాట్లు



పశ్చిమ రాజగోపురం ఎదురుగా ఏర్పాటు చేస్తున్న షామియానాలు



సత్యగిరిపై వాహనాల పార్కింగ్ స్థలాన్ని విస్తరిస్తున్నారిలా..

- రేపు రాత్రి ఆకాశ దీపంతో ఉత్సవాల ప్రారంభం
- నవంబరు 2న సత్యదేవుని తెప్పోత్సవం
- 5న గిరి ప్రదక్షిణ
- రత్నగిరిపై విస్తృతంగా ఏర్పాట్లు

అన్నవరం: హరిహరాదులకు ప్రీతికరమైన కార్తిక మాసం బుధవారం నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా అన్ని ఆలయాల్లో ఏర్పాట్లు చురుకుగా జరుగుతున్నాయి. సామర్లకోటలోని పంచారామ క్షేత్రం శ్రీ కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయం, పిఠాపురం పాదగయ క్షేత్రంతో పాటు హరిహర క్షేత్రంగా భాసిల్లుతున్న అన్నవరం శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామి దేవస్థానంలో కార్తిక మాసోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఆశ్వయుజ అమావాస్య సోమవారం సాయంత్రం ప్రారంభమై మంగళవారం సాయంత్రానికి ముగుస్తుంది. అయితే, శుద్ధ పాడ్యమి తిథి ఉదయం వేళకు ఉండటాన్ని పరిగణనలోకి తీసుకుంటారు కాబట్టి పంచాంగం ప్రకారం బుధవారమే కార్తిక మాసం ఆరంభమవుతుంది. అయితే, కార్తిక శుద్ధ పాడ్యమి తిథి మంగళవారం సాయంత్రమే వస్తున్నందున ఆలయాల్లో మాత్రం ఆ రోజు రాత్రి ఆకాశ దీపం ఏర్పాటుతో కార్తిక మాసోత్సవాలు ప్రారంభించనున్నారు. అన్నవరం దేవస్థానంలో కార్తిక అమావాస్య అయిన నవంబర్ 20వ తేదీ వరకూ ప్రతి రోజూ ఆకాశ దీపం ఏర్పాటు చేస్తామని ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యం తెలిపారు.

ఇవీ ఏర్పాట్లు

కార్తిక మాసంలో సత్యదేవుని సన్నిధికి లక్షలాదిగా భక్తులు తరలి రానున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని దేవస్థానంలో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు.

- శని, ఆది, సోమవారాలతో పాటు, దశమి, ఏకాదశి, క్షీరాబ్ది ద్వాదశి, కార్తిక పౌర్ణమి తదితర 16 పర్వదినాల్లో వేలాదిగా భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున తెల్లవారుజామున ఒంటి గంట నుంచే సత్యదేవుని వ్రతాలు, 2 గంటల నుంచి స్వామివారి దర్శనానికి భక్తులను అనుమతిస్తారు.
- పౌర్ణమి, ఏకాదశి, పర్వదినాల్లో పశ్చిమ రాజగోపురం వద్ద రోప్ పార్టీ ఏర్పాటు చేసి, అధిక సంఖ్యలో వచ్చే భక్తులను బృందాల వారీగా దర్శనానికి అనుమతిస్తారు.
- పర్వదినాల్లో ముందు రోజు రాత్రే వ్రతాల టికెట్లు ఇస్తారు. దీనికి గాను ఇప్పటికే ఉన్న వాటికి అదనంగా కౌంటర్లు ఏర్పాటు చేస్తారు. స్వామివారి దర్శనం టికెట్లు, ప్రసాద విక్రయాలకు కూడా అదనంగా కౌంటర్లు ఏర్పాటు చేస్తారు.
- కార్తిక శుద్ధ ద్వాదశి (క్షీరాబ్ది ద్వాదశి) సందర్భంగా నవంబర్ రెండో తేదీ రాత్రి 6.30 గంటల నుంచి పంపా సరోవరంలో సత్యదేవుని తెప్పోత్సవం ఘనంగా నిర్వహిస్తారు.
- కార్తిక పౌర్ణమి సందర్భంగా నవంబర్ ఐదో తేదీ ఉదయం సత్యదేవుని గిరి ప్రదక్షిణ పల్లకీ మీద లాంఛనంగా నిర్వహిస్తారు. మధ్యాహ్నం 2 గంటలకు సత్యరథంతో గిరి ప్రదక్షిణ ఘనంగా ప్రారంభించి, సాయంత్రం ఆరున్నర గంటలకు ముగిస్తారు. అదే రోజు సాయంత్రం 5.45 గంటలకు పంపా జలాశయం వద్ద పంపా హారతులు, రాత్రి 7 గంటలకు తొలి పావంచా వద్ద జ్వాలాతోరణం నిర్వహిస్తారు.
- కార్తికం నెల రోజులూ చిన్న కార్లు, ఆటోలు మినహా మరే ఇతర వాహనాలను కొండ మీదకు అనుమతించరు. పెద్ద వాహనాలను భక్తులు కళాశాల మైదానంలో నిలిపివేసి, దేవస్థానం బస్సులు, ఆటోల ద్వారా కొండ మీదకు చేరుకోవాలి.
- కొండ మీదకు వచ్చే చిన్న కార్లను సత్యగిరి రోడ్డు పక్కన, సత్రాల ఆవరణలో నిలుపు చేస్తారు. దీనికోసం పార్కింగ్ స్థలాన్ని ప్రత్యేకంగా విశాలంగా రూపొందిస్తున్నారు. సుమారు 4 వేల కార్ల పార్కింగ్‌కు ఏర్పాట్లు చేస్తున్నారు. కొండ దిగువకు వెళ్లే వాహనాలను ఆదిశంకర మార్గ్ ద్వారా పంపిస్తారు.
- రత్నగిరిపై 2 వేల మంది సేద తీరేందుకు వీలుగా డార్మెట్రీ, విష్ణు సదన్‌లో 36 హాళ్లు ఉన్నాయి. సీఆర్ఓ కార్యాలయం వద్ద నిర్మించిన డార్మెట్రీలో లాకర్లతో పాటు అన్ని సదుపాయాలూ కల్పించారు. ఈఓ కార్యాలయం దిగువన ఉన్న మెయిన్ క్యాంటీన్‌ను కూడా డార్మెట్రీగా మార్చనున్నారు.
- విద్యుత్ సరఫరా 24 గంటలూ నిరాటంకంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నారు.
- దేవస్థానం, కొండ దిగువన మెయిన్ రోడ్డు, రైల్వే స్టేషన్ రోడ్డులో పారిశుద్ధ్యం మెరుగుపడేలా అదనపు సిబ్బందిని నియమించారు.
- భక్తుల కోసం రత్నగిరి పైన, దిగువన 457 టాయిలెట్లు ఉన్నాయి. గిరి ప్రదక్షిణ రోడ్డులో 24 టాయిలెట్లు తాత్కాలికంగా ఏర్పాటు చేశారు. గిరి ప్రదక్షిణ రోడ్డులో ఈసారి విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయనున్నారు.
- కార్తిక మాసంలో అన్నదానానికి బదులు సర్క్యులర్ మండపం వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకూ భక్తులకు పులిహోర, దద్ధోజనం.. చిన్నారులకు పాలు, బిస్కెట్లు పంపిణీ చేస్తారు. అన్నదాన పథకంలో సెక్యూరిటీ సిబ్బందికి, కళాకారులకు మాత్రమే భోజన సౌకర్యం ఉంటుంది.
- పశ్చిమ రాజగోపురం వద్ద లారెస్ ఫార్మాస్యూటికల్స్ (విశాఖపట్నం) నిర్మించిన విశ్రాంతి షెడ్డులో సుమారు 5 వేల మంది భక్తులు సేద తీరే అవకాశం ఉంది. ఈ షెడ్డులోనే భక్తులకు వ్రతాలు, దర్శనం, ప్రసాదాల టికెట్ల విక్రయాలకు కౌంటర్లు ఏర్పాటు చేయనున్నారు.

22 లక్షల మంది వస్తారని అంచనా

గత ఏడాది కార్తికంలో సత్యదేవుని ఆలయానికి 20 లక్షల మంది భక్తులు వచ్చారన్నది అంచనా. ఈసారి 22 లక్షల మందికి పైగా వస్తారని భావిస్తూ ఆ మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు. 2022 కార్తికంలో 1.42 లక్షల వ్రతాలు జరిగాయి. 2023లో తుపాన్ల కారణంగా ఆ సంఖ్య 1.25 లక్షలకే పరిమితమైంది. గత ఏడాది కార్తికంలో 1.47 లక్షలకు పెరిగింది. ఈసారి సుమారు 1.50 లక్షల వ్రతాలు జరుగుతాయని అంచనా వేస్తున్నారు. గత ఏడాది కార్తికంలో సత్యదేవుని ప్రసాదం ప్యాకెట్లు 22 లక్షలు విక్రయించారు. ఈసారి 25 లక్షలకు పైగా విక్రయించే అవకాశం ఉంది. దీనికి అవసరమైన గోధుమలు, నెయ్యి, పంచదార సిద్ధంగా ఉంచారు. గత కార్తికంలో సత్యదేవునికి రూ.21.14 కోట్ల ఆదాయం వచ్చింది. ఈసారి రూ.25 కోట్లు వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు.

రూ.3 కోట్లతో ఏర్పాట్లు



కార్తిక మాసంలో లక్షలాదిగా వచ్చే భక్తుల కోసం దాదాపు రూ.3 కోట్ల వ్యయంతో నిర్మాణాలు చేపట్టాం. వివిధ సత్రాలకు రూ.కోటితో మరమ్మతులు చేసి, రంగులు వేయించాం. వ్రతాలాచరించే భక్తుల కోసం కూడా తగిన ఏర్పాట్లు చేశాం. భక్తులను ఇబ్బంది పెట్టవద్దని వ్రత పురోహితులను ఆదేశించాం. రూ.15 లక్షలతో తెప్పోత్సవ ఏర్పాట్లు చురుకుగా జరుగుతున్నాయి. గిరి ప్రదక్షిణకు కూడా ఏర్పాట్లు చేస్తున్నాము. ఇందులో పాల్గొనే భక్తులకు మజ్జిగ, పండ్లు, ఫలహారాలు పంపిణీ చేస్తాం.

- వీర్ల సుబ్బారావు, ఈఓ, అన్నవరం దేవస్థానం

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్త కొబ్బరి (క్వింటాల్)	20,000 – 22,500
కొత్త కొబ్బరి (రెండో రకం)	10,500 – 12,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	30,000
గటగట (వెయ్యి)	28,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	29,000
గటగట (వెయ్యి)	27,000
నీటికాయ	
పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	23,000 – 25,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	23,000 – 25,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	5,250
కిలో	350

ముంపే మేజర్ సమస్య

- అభివృద్ధికి దూరంగా శంకరగుప్తం డ్రైన్
- ఏళ్ల కాలంగా పట్టించుకోని పాలకులు
- ముంపు నుంచి రక్షించాలని రైతుల మొర

మలికిపురం: రాజోలు దీవిలో బంగాళాఖాతానికి కాస్త పైన, రెండు గోదావరి పాయల మధ్య సహజ సిద్ధంగా రక్తతుల్య నది ఏర్పడింది. ఇది క్రీక్ అని భౌగోళిక నదీ పరివాహక మ్యాప్‌లో ఉంది. ఈ క్రీక్‌కు బంగాళాఖాతానికి మధ్య ఏడు గ్రామాలతో మరో దీవి ఉంది. ధవళేశ్వరం వద్ద ఆనకట్ట నిర్మించాక కాటన్ మహాశయుడు ఈ క్రీక్‌కు శంకరగుప్తం మేజర్ డ్రైన్‌గా పేరు పెట్టారు. ఆనకట్ట నిర్మించిన సమయంలో ఏర్పడిన పలు కొత్త మేజర్, మైనర్ డ్రైన్లు, ప్రధాన కాలువల నుంచి శివారు కాలువలు ఈ డ్రైన్లలో కలిసేలా ఏర్పాట్లు చేశారు. ఇక్కడి నుంచి వైనతేయ మీదుగా సముద్రంలో కలుస్తుంది. అయితే మేజర్ డ్రైన్‌లోకి మురుగునీరు రావడం, ఒకవైపు సముద్ర పోటు పాట్లు, వరదల వేళ పోటెత్తడంతో యాభై ఏళ్లుగా ఈ క్రీక్ రైతులకు దుఃఖదాయినిగా మారింది.

సుమారు 80 గ్రామాలతో కూడిన రాజోలు దీవికి మూడు వైపులా గోదావరి నది, మరోవైపు బంగాళాఖాతం ఉన్నాయి. మొత్తం గోదావరి నదికి వచ్చే వరద నీటిలో ఏటా సుమారు 90 లక్షల క్యూసెక్కులకు పైగా నీరు అంటే మూడొంతుల్లో రెండొంతుల నీరు వశిష్ఠ, వైనతేయ పాయల మధ్యే సముద్రంలో కలుస్తుంది. సరిగ్గా ఈ రెండు పాయల మధ్యే శంకరగుప్తం డ్రైన్ ఉంది. క్రీక్ వైనతేయ నదిలో కలిసే ముఖ ద్వారానికి ఎదురుగా కూనవరం మేజర్ డ్రైన్ ఉంటుంది. అటు నుంచి వచ్చే ముంపునీరు కూడా ఈ డ్రైన్‌కు ఎదురు



శంకరగుప్తం డ్రైన్ కారణంగా జి.పల్లిపాలెంలో మోడువారుతున్న కొబ్బరి చెట్లు

కావడం వల్ల శంకరగుప్తంపై భారీ ఒత్తిడి పడుతోందని డ్రైనేజీ శాఖ ప్రస్తుత అంచనా. శంకరగుప్తం డ్రైన్‌కు బంగాళాఖాతం వైపు ఉన్న ఏడు గ్రామాల దీవికి, రాజోలు దీవితో 1970 వరకూ వంతెనలే లేవు. పి.గన్నవరం అక్విడెక్ట్ కట్టిన తర్వాత నుంచి ఇక్కడ డ్రైనేజీ వ్యవస్థపై ప్రభుత్వ శాఖలు శ్రద్ధ పెట్టలేదు. ఫలితంగా నేటికీ డ్రైన్లకు హద్దులు లేక ఆక్రమణలతో, ముంపు సమస్యలతో ఆనకట్ట రైతాంగం వ్యవసాయానికి దూరమవుతోంది.

అప్పటి నుంచీ ఇలా..

రాజోలు దీవిలో శంకరగుప్తం డ్రైన్‌తో అవస్థలు తొలగించాలని 1960 నుంచి ఆందోళనలు మొదలయ్యాయి. ఫలితంగా 1971–72 మధ్య కేశనపల్లి సర్పంచ్ యెనుముల బాపిరాజు హయాంలో రూ.లక్షతో శంకరగుప్తం డ్రైన్‌కు మరమ్మతులు చేశారు. అప్పట్లో తూర్పుపాలెం వైపు అడ్డుకట్ట వేసి సుమారు 400 మంది కార్మికులు కొన్ని నెలల పాటు పూడిక తీసి ఏటిగట్లు వేశారు. కనుమరుగైన ఆ ఏటిగట్లనే నేడు పునర్నిర్మించాలని అంతా కోరుతున్నారు. తిరిగి 1980లో డ్రైన్‌లో ముంపునీటి పారుదల మెరుగుకు డ్రైన్ చివరి భాగం అయిన కేశవదాసుపాలెం నుంచి నేరుగా సముద్రంలోకి స్ట్రెయిట్ కట్ తవ్వారు. ఇక్కడ మెరక వల్ల, సముద్ర కెరటాల ఉధృతి వంటి సాంకేతిక సమస్యలతో స్ట్రెయిట్ కట్ మూసుకుపోయి మురుగు కిందకు దిగని దుస్థితి నెలకొంది. తిరిగి 2006లో కేశవదాసుపాలెం నుంచి కత్తిమండ వరకూ అప్పట్లో రూ.40 లక్షలతో పూడికతీసి గట్లు వేశారు. ఇది చాలా ఉపయోగపడింది. గట్లు వేయడం వల్ల ఉప్పునీరు పొలాలకు చేరకపోవడంతో రైతులకు మేలు జరిగింది. అనంతరం 2016లో రూ.15 కోట్లతో డ్రైన్ ముఖ ద్వారం కరవాక నుంచి కేశనపల్లి వరకూ 8 కిలోమీటర్ల మేర డ్రెడ్జింగ్ చేశారు. అప్పట్లో డ్రెడ్జింగ్ మట్టిని గట్లుగా వేయాలని ప్రతిపాదనలు ఉన్నా ఇంజినీర్లు, అప్పటి పాలకులు కుమ్మక్కయ్యారనే ఆరోపణలు ఉన్నాయి. గట్లు వేయకుండా, పూడిక మట్టిని నేరుగా రైతుల పొలాల్లోకి తరలించడంతో వేలాది ఎకరాలలో కొబ్బరి తోటలు దెబ్బతిన్నాయి.

పార్టీలకతీతంగా ఏకమై..

శంకరగుప్తం డ్రైన్ ముంపు రాజోలు దీవిలో **పది వేల మంది** రైతులకు చెందిన సుమారు 20 వేల **ఎకరాల్లో 1.50** లక్షల కొబ్బరి చెట్లను నాశనం **చేసింది.** ప్రస్తుతం ఈ ప్రాంత రైతులు, ప్రజలు **పార్టీలకు అతీతంగా** పోరాటం చేస్తున్నారు. **అయినా ఈ** సమస్య పరిష్కారానికి రూ.15 **కోట్లతో చేసిన** ప్రతిపాదనలు ఆర్థిక శాఖ వద్ద **పెండింగ్‌లో** ఉన్నాయి. ఇటీవల మంత్రి నిమ్మల **రామానాయుడు** రాష్ట్ర ఇరిగేషన్ సలహాదారు **ఎం.వెంకటేశ్వ**రరావుతో పర్యటించి తిరిగి ప్రతి**పాదనలు చే**యాలని సూచించారు. ఈ నెలలో **డిప్యూటీ సీఎం** పవన్ కల్యాణ్ కూడా ఈ డ్రైన్‌ను పరిశీలించనున్నారు. కొత్త ప్రతిపాదనలతో అంచనాలు రూ.30 కోట్ల వరకూ చేరే అవకాశం ఉంది. డ్రెడ్జింగ్ చేసి ఇరువైపులా ఆరు మీటర్ల వెడల్పుతో ఏటిగట్లు వేయాలని నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. దీనికిగాను ప్రస్తుత డ్రైన్ వాస్తవ పరిస్థితిపై ఉన్నతాధికారులు సర్వే చేస్తున్నారు.

నిధుల బట్టి చర్యలు



డ్రైన్ పొడవునా ప్రత్యేక బృందంతో అధ్యయనం చేశాం. ఇందులో ఇరిగేషన్‌కు చెందిన జీడీఎస్, సీడీఓ ఇంజినీర్ల బృందం ఉన్నారు. ముంపు నుంచి రక్షణకు ఎటువంటి చర్యలు తీసుకోవాలనే అంశంపై నివేదికను ప్రభుత్వానికి అందజేశాం. నిధుల లభ్యతను బట్టి తదుపరి చర్యలు ఉంటాయి.

–ఎంవీవీ కిషోర్,
డ్రైనేజీ శాఖ ఈఈ, కాకినాడ

విజయమివ్వు విఘ్నేశ్వరా..



విశేషాలంకరణలో అయినవిల్లి విఘ్నేశ్వర స్వామివారు

అయినవిల్లి: ప్రసిద్ధి చెందిన అయినవిల్లి విఘ్నేశ్వర స్వామి ఆలయానికి ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయ ప్రధానార్చకుడు మాచరి వినాయకరావు ఆధ్వర్యంలో స్వామివారికి తెల్లవారు జామున మేలుకొలుపు సేవ, పంచామృతాభిషేకాలు, ఏకాదశ, లఘున్యాస పూర్వక అభిషేకాలు, శ్రీలక్ష్మీగణపతి హోమం, గరిక పూజ జరిపారు. స్వామివారిని వివిధ పుష్పాలతో అర్చకులు సర్వాంగ సుందరంగా అలంకరించారు. స్వామికి మహా నివేదన చేశారు. సాయంత్రం ఎనిమిది గంటలకు స్వామికి విశేష సేవలు చేసి ఆలయం తలుపులు మూసివేశారు. లఘున్యాస ఏకాదశ రుద్రాభిషేకాల్లో 100 మంది పాల్గొన్నారు. ముగ్గురికి తులాభారం నిర్వహించారు. శ్రీలక్ష్మీ గణపతి హోమంలో 23 జంటలు పాల్గొనగా, స్వామికి ఒక భక్తుడు తలనీలాలు సమర్పించారు. 27 మంది వాహన పూజలు చేయించుకున్నారు. 1,480 మంది స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. ఆదివారం ఒక్క రోజు ఆలయానికి వివిధ పూజా టిక్కెట్లు, అన్నదాన విరాళాలుగా రూ.2,05,396 ఆదాయం సమకూరిందని అసిస్టెంట్ కమిషనర్, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.

క్లుప్తంగా

శ్రీప్రకాష్‌లో ధన్వంతరి జయంతి వేడుకలు



రవీంద్రన్‌ను సన్మానిస్తున్న ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు తదితరులు

తుని: స్థానిక శ్రీప్రకాష్ ఆయుర్వేద ఆసుపత్రిలో ఆయుర్వేద మూల పురుషుడు ధన్వంతరి జయంతి, జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని శ్రీప్రకాష్ ఆయుష్ చారిటబుల్, రీసెర్చ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ శ్రీప్రకాష్ ఆయుష్ చారిటబుల్, రీసెర్చ్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు సీహెచ్‌వీకే నరసింహారావు, రామసీత దంపతులు ధన్వంతరి హోమం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథులుగా ప్రముఖ ఆయుర్వేద వైద్యులు కన్నాలయం గోపాలన్ రవీంద్రన్, ప్రవచనకర్త, ఆధ్యాత్మిక వేత్త చాగంటి కోటేశ్వరరావు హాజరయ్యారు. రవీంద్రన్‌ను చాగంటి కోటేశ్వరరావు సత్కరించారు. డాక్టర్ గోపాలన్ రవీంద్రన్ మాట్లాడుతూ ఆరోగ్యమైన జీవనానికి ఆయుర్వేదం దిక్సూచి లాంటిదన్నారు. ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు మాట్లాడుతూ గొప్ప వ్యక్తుల జీవిత చరిత్ర తెలుసుకోవడం, పుస్తకాలు చదవడం ద్వారా జ్ఞానాన్ని పొందుతామన్నారు. ఉన్నత స్థితికి చేరడానికి గురువు దిక్సూచి అన్నారు. నరసింహారావు మాట్లాడుతూ ఈ ప్రాంత వాసులకు ఆయుర్వేద వైద్యం అందించాలన్న లక్ష్యంతో ఆయుర్వేద చికిత్సాలయం స్థాపించామన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నారు. అకాడమీ ఆయుర్వేద ఆసుపత్రి ట్రస్టీ డాక్టర్ యు.ఇందులాల్, సైకాలజికల్ కౌన్సిలర్ అపర్ణశర్మ, శ్రీప్రకాష్ విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్ విజయ్‌ప్రకాష్, ఆయుర్వేద చికిత్సాలయ సలహాదారుడు ఆలపాటి రాజేంద్రప్రసాద్, ప్రధాన వైద్యులు టి.రమేష్‌బాబు, ఎంపీ సుమయ్య పాల్గొన్నారు.

కార్తిక స్నానాలకు గోదావరి ఘాట్లు సిద్ధం



కోటిలింగాల ఘాట్‌లో పరిశుభ్రత పనులు



పుష్కరఘాట్‌ను శుభ్రం చేస్తున్న సిబ్బంది

రాజమహేంద్రవరం సిటీ: కార్తిక మాసాన్ని పురస్కరించుకుని గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించే భక్తుల కోసం రామహేంద్రవరం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో గోదావరి ఘాట్లను సిద్ధం చేస్తున్నారు. నగరంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల భక్తులు వేలాదిగా వచ్చే అవకాశం ఉంది. మొత్తం 7 ఘాట్లలో పుణ్య స్నానాలకు అవసరమైన ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రసిద్ధి చెందిన కోటిలింగాల ఘాట్, చింతాలమ్మ ఘాట్, దుర్గాదేవి ఘాట్, పుష్కర ఘాట్, మార్కండేయ స్వామి ఘాట్, సరస్వతీ ఘాట్, గౌతమ ఘాట్‌లలో స్నానాలు ఆచరించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. నదిలో దిగి స్నానం చేయలేని వృద్ధులు, చిన్నారులు, మహిళల కోసం దుర్గాదేవి ఘాట్ మినహా జల్లు స్నానాలు ఏర్పాటు చేశారు. వీటితో పాటు భక్తులు దుస్తులు మార్చుకునేందుకు తాత్కాలిక గదులను సిద్ధం చేశారు. పారిశుధ్య చర్యలు చేపట్టేందుకు కార్మికులను అదనంగా నియమించారు. రెండు షిఫ్ట్‌లలో సుమారు 80 మంది పని చేయనున్నారు. స్నానాలు ఆచరించే సమయంలో భక్తులకు ఏవిధమైన అసౌకర్యం లేకుండా ఘాట్‌లలో ఇసుకను ఏర్పాటు చేసినట్టు అధికారులు తెలిపారు. కార్తీక సోమవారం, పౌర్ణమి సమయాల్లో భక్తుల రద్దీకి అనుగుణంగా వైద్య శిబిరాలు నిర్వహిస్తామని నగరపాలక సంస్థ శానిటరీ సూపర్‌వైజర్ ఐ.శ్రీనివాస్ వెల్లడించారు.

చీరమేను... అదిరేను



చీరమేను గారెలు



యానాం మార్కెట్‌లో అమ్మకానికి సిద్ధం చేసిన చీరమేను

యానాం మార్కెట్‌కు విరివిగా చేపలు


యానాం: గోదావరి నదీ ముఖ ద్వారాల వద్ద చీరమేను అధికంగా పడుతుండటంతో మత్స్యకారుల ఆనందానికి అవధులు లేవు. పులస తర్వాత అక్టోబర్, నవంబర్ మాసాల్లో వచ్చే చీరమేనుకు డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. రుచికరంగా ఉండటంతో మాంసాహార ప్రియులు చీరమేను కొనుగోలుకు పోటీ పడుతున్నారు. ఇప్పుడు ఎక్కువగా పడుతుండటంతో చీరమేనును కూరతో పాటు గారెలను సైతం వేసుకుంటున్నారు. స్థానికంగా ఓ కుటుంబం చీరమేనును గారెలుగా వేసి పలువురికి రుచి చూపించారు. గారెలు చేయడానికి కావాల్సిన పదార్థాలు సైతం ప్రదర్శించారు.

అమ్మకాల జోరు

యానాం మార్కెట్‌లో చీరమేను అమ్మకాల సందడి నెలకొంది. సేరు, బకెట్, క్యారేజీ కొలతల్లో చీరమేను అమ్మకాలు సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో పది సేర్ల బకెట్ రూ.18 వేలకు అమ్ముడుకాగా, అనంతరం చీకటి పడటంతో అది కాస్తా రూ.12 వేలకు దిగింది.

ఒక్క క్లిక్‌తో సమగ్ర సమాచారం

- పాఠశాలల అభివృద్ధికి యూ డైస్ ప్లస్
- 23 నుంచి ఆధార్ నవీకరణ శిబిరాలు



అపార్ కార్డు

రాయవరం: విద్యా వ్యవస్థ సమగ్ర సమాచారాన్ని ఒకచోట నిక్షిప్తం చేసేందుకు పాఠశాల విద్యాశాఖ చర్యలు తీసుకుంటోంది. ఇందుకుగాను యూడైస్ ప్లస్ (యూనిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టం ఫర్ ఎడ్యుకేషన్) వెబ్‌సైట్‌ను కేంద్ర ప్రభుత్వం రూపొందించింది. ఒక్క క్లిక్‌తో ప్రభుత్వ పాఠశాలల పూర్తి సమాచారం వెబ్‌సైట్‌లో ప్రత్యక్షమవుతోంది. పాఠశాలల స్థితిగతులు, విద్యార్థులు, ఉపాధ్యాయుల సమాచారంతో పాటు మౌలిక వసతులు ఏ పాఠశాలలో ఎలా ఉన్నాయో, ఎంత మంది విద్యార్థులు డ్రాప్‌అవుట్ అయ్యారన్న విషయాలు స్పష్టంగా తెలుసుకునే వీలుంది. ఇప్పుడు పాఠశాల ప్రధానోపాధ్యాయులు యూడైస్ ప్లస్‌ను అప్‌డేట్ చేసే పనిలో నిమగ్నమయ్యారు. గతంలో యూడైస్ నమోదు మాన్యువల్‌గా ఉండగా 2022–23 నుంచి యూడైస్ ప్లస్ (యూనిఫైడ్ డిస్ట్రిక్ ఇన్ఫర్మేషన్ సిస్టం ఫర్ ఎడ్యుకేషన్ ప్లస్)గా ఆధునికీకరించారు. అప్పటి నుంచి కేంద్ర ప్రభుత్వం వెబ్‌సైట్ ద్వారా సమాచారాన్ని సేకరించి, అప్‌డేట్ చేస్తున్నారు. గతంలో ఏడాదికోసారి సమాచారం అప్‌డేట్ చేయగా.. ఇకపై నిరంతరం సాంకేతికత ఆధారంగా సమాచారాన్ని అప్‌డేట్ చేసే అవకాశం ఉంది. పాఠశాలలో మౌలిక వసతులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల మాడ్యుల్స్‌గా వెబ్‌సైట్‌ను మూడు భాగాలుగా విభజించి సమాచారం నిక్షిప్తం చేస్తున్నారు. ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయుల నేతృత్వంలో ఈ ప్రక్రియ కొనసాగిస్తున్నారు.

వివరాలు కీలకం

జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఎల్‌కేజీ నుంచి ఇంటర్ వరకు చదువుకుంటున్న ప్రతి విద్యార్థి వివరాలు వెబ్‌సైట్‌లో పొందుపరుస్తున్నారు. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థుల వివరాలు నమోదు చేయగా, ప్రస్తుత సమాచారంతో అప్‌డేట్ చేస్తున్నారు. అలాగే పాఠశాలల్లోని తరగతి గదులు, మరుగుదొడ్లు, వంట గదులు, తాగునీరు తదితర సదుపాయాల వివరాలతోపాటు వాటి స్థితిగతులపై తాజా సమాచారాన్ని పొందుపరుస్తున్నారు. పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వ పరంగా అందుతున్న వసతుల కల్పనకు యూడైస్ ప్లస్‌లోని వివరాలు కీలకం కానున్నాయి. అవినీతికి పాల్పడకుండా ఈ విధానం ఉపయోగపడనుంది. వెబ్‌సైట్‌లో నమోదైన విద్యార్థులకే యూనిఫాం, అల్పాహారం, మధ్యాహ్న భోజనం, పాఠ్యపుస్తకాలు తదితర వాటిని అందించనున్నారు.

ప్రతి విద్యార్థికి నంబర్ కేటాయింపు

యూ డైస్ ప్లస్ పోర్టల్ కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తుంది. ప్రతి ఏడాది అన్ని పాఠశాలల సమగ్ర వివరాలను ప్రధానోపాధ్యాయులు నమోదు చేయాల్సి ఉంటుంది. ఇందులో నమోదు చేసిన ప్రతి విద్యార్థికి ఒక పర్మినెంట్ ఎడ్యుకేషన్ నంబర్ (పీఈఎన్) కేటాయిస్తారు. దీని ద్వారా ఆ విద్యార్థి దేశ వ్యాప్తంగా ఏఏ పాఠశాలల్లో ఏఏ తరగతులు చదివాడు అనేది కచ్చితంగా తెలుస్తుంది. పదో తరగతి విద్యార్థి బోర్డు పరీక్షలు రాయాలంటే ఇందులో నమోదై ఉండాల్సిందే. అలాగే ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (అపార్) ప్రతి విద్యార్థికి ఆధార్ కార్డు మాదిరిగానే జారీ చేయాలి. జిల్లాలో 2.40 లక్షల మందికి అపార్ కార్డులు జనరేట్ చేయాల్సి ఉండగా, 2.25 లక్షల మందికి పూర్తయ్యింది. ఇంకా 15 వేల మందికి అపార్ కార్డులు జనరేట్ చేయాలి.

23 నుంచి ఆధార్ శిబిరాలు

కేంద్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పాఠశాల విద్యార్థులకు ఉచితంగా ఆధార్ అప్‌డేట్ చేపడుతున్నారు. ఇందులో భాగంగా 5 నుంచి 15 ఏళ్లు పైబడి ఉన్న విద్యార్థుల వేలిముద్రల అప్‌డేషన్ చేయనున్నారు. జిల్లాలో ఎల్‌కేజీ నుంచి ఇంటర్ వరకు చదువుతున్న 2.40 లక్షల మంది విద్యార్థుల ఆధార్ అప్‌డేషన్ కార్యక్రమం చేపట్టాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకు 1.98 లక్షల మంది అప్‌డేట్ కాగా, ఇంకా 42 వేల మంది విద్యార్థులకు ఆధార్ వేలిముద్రల అప్‌డేషన్ చేయాల్సి ఉంది. దీనికోసం పాఠశాలల్లో గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది ఆధార్ అప్‌డేషన్ శిబిరాలను ఈ నెల 23 నుంచి 30 వరకూ నిర్వహించనున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లోని విద్యార్థులు, ఉపాధ్యాయుల వివరాల నమోదు ప్రక్రియ, అప్‌డేషన్ నిరంతరాయంగా జరుగుతోంది. ఈ నెల 23 నుంచి నిర్వహిస్తున్న ఆధార్ అప్‌డేషన్‌ను పాఠశాల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. యూ డైస్ ప్లస్ సమాచారం ఆధారంగా ప్రభుత్వ బడుల్లో మౌలిక వసతుల సదుపాయాలకు నిధులు కేటాయిస్తున్నారు.

– డాక్టర్ షేక్ సలీం బాషా, డీఈఓ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

వేగవంతం చేయాలి



ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో యూ డైస్ ప్లస్ నమోదు, అప్‌డేషన్‌ను ప్రధానోపాధ్యాయులు, కళాశాలల ప్రిన్సిపాల్స్ వేగవంతం చేయాలి. ఈ నెలాఖరులోగా నూరు శాతం పూర్తి చేయాలి. ఇప్పటికే ఉప విద్యాశాఖాధికారులు, మండల విద్యాశాఖాధికారులకు అవగాహన కల్పించాం. గడువుకు ముందే నమోదు ప్రక్రియ పూర్తి చేయాలి.

– డి.తాతారావు, ఏఎస్ఓ, జిల్లా విద్యాశాఖ కార్యాలయం, ముమ్మిడివరం

విధుల్లోనే ఉండమంటారు!

- దీపావళికి నోచుకోని అగ్నిమాపక శాఖ
- కుటుంబాలకు దూరంగా ఉండాల్సిందే!
- ఖాళీ పోస్టులు భర్తీకాక మరింత ఇబ్బంది



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది (ఫైల్)

కొత్తపేట: దీపావళి.. అందరికీ ఎంతో అమితమైంది. టపాసులు పేల్చుతూ, ఆ వెలుగులను చూసి కుటుంబంతో సంతోషంగా గడిపే రోజు అది. అలాంటి పండగకూ అగ్నిమాపక సిబ్బంది ఎప్పుడూ దూరమే.. ఎందుకంటే ఆ పండగ రోజునే అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉండడంతో, ఆ రాత్రంతా మేల్కొని విధులు నిర్వహిస్తామని ఆ శాఖ సిబ్బంది చెబుతున్నారు. ప్రతి అగ్నిమాపక కేంద్రం వద్ద విధుల్లో ఉండే ఫైర్‌మెన్‌ల పరిస్థితి దయనీయమనే చెప్పాలి. దీనికితోడు ఈ శాఖలో ఖాళీలను భర్తీ చేయకపోవడంతో ఉన్న సిబ్బందిపైనే ఒత్తిడి పెరిగి పండగ రోజుల్లోనూ అందరూ విధులు నిర్వర్తించాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. ప్రభుత్వ శాఖలకు దీపావళి రోజు సెలవు అయినప్పటికీ, కానీ ఒక్క అగ్నిమాపక శాఖకు మాత్రం సెలవు ఉండదు. కచ్చితంగా విధులకు హాజరు కావాల్సిందే. ఎందుకంటే ఎక్కడ ఏ అగ్ని ప్రమాదం సంభవిస్తుందోనని అప్రమత్తంగా ఉంటూ డ్యూటీ చేయాలి. అంతేకాదు దీపావళికి వారం, పది రోజుల ముందు నుంచే ఆఫ్ కూడా తీసుకోకుండా ఆన్ డ్యూటీలో ఉండాలి. ఈ విధంగా వారు దీపావళి పండగకు దూరమవుతున్నారు.

సిబ్బంది లేక.. ఇబ్బంది

రాష్ట్రంలో పోలీసు, జైళ్ల శాఖ, ఏపీఎస్పీ, ఏఆర్ డిపార్ట్‌మెంట్లలో అన్ని ఖాళీలు భర్తీ చేశారు. కానీ అగ్నిమాపక శాఖలో మాత్రం ఖాళీలను మాత్రం భర్తీ చేయలేదు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 17 అగ్నిమాపక కేంద్రాలు ఉన్నాయి. ఒక్కో కేంద్రానికి లీడింగ్ ఫైర్‌మెన్, ఫైర్‌మెన్, డ్రైవర్లు, ఇలా సుమారు 15 మంది ఉండాలి. అలా జిల్లాలో సుమారు 255 మంది సిబ్బంది అవసరం. కానీ ప్రస్తుతం 147 మంది మాత్రమే ఉండడం గమనార్హం. ఇందులో అమరావతి, కూనవరం తదితర డ్యూటీలకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన సిబ్బందినే పంపిస్తున్నారు. అలా డ్యూటీ పడిన సిబ్బంది ప్రతి నాలుగు నెలలకు 15 రోజులు అదనపు డ్యూటీలు చేయాల్సి వస్తుందని ఆ శాఖ జిల్లా యూనియన్ నాయకులు చెబుతున్నారు. సిబ్బంది లేక ఇబ్బంది ఎదురవుతోందని, అగ్నిమాపక శాఖలో ఖాళీలను భర్తీ చేయాలని వారు కోరుతున్నారు.


ఏ పండగ వచ్చినా ఇంతే..

ఒక్క దీపావళి మాత్రమే కాదు.. ఏ పండగకు నోచుకోం.. దీపావళి అంటే అగ్ని ప్రమాదాలకు అవకాశం ఉన్న పండగ. సంక్రాంతి పండగ అంటే ఎక్కడికక్కడ ప్రభల ఉత్సవాలు, ఊరేగింపులు, బాణసంచా కాల్పులు వంటి కార్యక్రమాలు జరుగుతాయి. ఇలా ప్రతి పండగ మా శాఖతో ముడిపడి ఉంటుంది. కుటుంబ ఆనందాలు వదులకుని ప్రజల ఆస్తి, ప్రాణ రక్షణ కర్తవ్యంగా పనిచేస్తున్నామని అగ్నిమాపక శాఖ సిబ్బంది చెబుతున్నారు. ప్రతి ఏడాది దీపావళికి ముందురోజు డ్యూటీ ఆఫ్ వస్తే టపాసులు కొని ఇంటికి తీసుకువెళ్లి ఇచ్చి జాగ్రత్తగా కాల్చుకోమని చెప్పి తిరిగి డ్యూటీకి వచ్చేవాళ్లమని, ఈసారి రాయవరంలో భారీ విస్ఫోటం కారణంగా ఆ అవకాశం కూడా లేకుండా పోయిందని వారు వాపోయారు.


వరుసగా మూడు రోజులూ..

రాష్ట్ర వ్యాప్తంగా ఆన్ అండ్ ఆఫ్ డ్యూటీలు చేయాలని ఆ శాఖ ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి. దీంతో దీపావళికి రెండు రోజుల ముందు నుంచీ విధులు నిర్వర్తించాల్సిందే. వరుసగా దీపావళి వరకూ ఆన్ డ్యూటీలో ఉండాల్సిందే. ఇటీవల రాయవరంలో జరిగిన బాణసంచా పేలుడు నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆ శాఖ అధికారులు చెబుతున్నారు. దీంతో అగ్నిమాపక సిబ్బంది తప్పనిసరి పరిస్థితుల్లో వరుసగా మూడు రోజులూ విధులు నిర్వర్తిస్తున్నారు.

పెట్రోల్‌కు బదులు వర్షం నీరు



బైక్ స్టార్ట్ కాకపోవడంతో అవస్థలు పడుతున్న వాహనదారులు



వాహనాల నుంచి బయటకు తీసిన వర్షపునీరు

తుని రూరల్: తుని మండలం తేటగుంట శివారు ఎర్రకోనేరు వద్ద ఓ పెట్రోల్ బంకులో యాజమాన్యం నిర్వాకంతో పెట్రోల్‌కు బదులుగా మోటార్ సైకిళ్లకు వర్షపు నీరు పోశారు. ఆదివారం ఉదయం పెట్రోల్ కోసం పలువురు వాహనదారులు వెళ్లారు. పెట్రోల్ నింపినా వాహనాలు స్టార్ట్ కాకపోవడంతో వినియోగదారులు అవాక్కయ్యారు. చివరికి బంకులో నింపిన పెట్రోల్‌ను బయటకు తీసి చూడగా ఎర్రగా నీరు వచ్చింది. ఆందోళన వ్యక్తం చేసి వాహనదారులు బంకు యాజమాన్యాన్ని నిలదీశారు. దీంతో డబ్బు తిరిగి ఇచ్చేస్తామనడంతో వాహనదారులు శాంతించారు. బంకులో పెట్రోల్ ట్యాంకు పైపు లైన్‌కు మరమ్మతులు చేస్తుండడం, శనివారం రాత్రి భారీ వర్షం కురవడంతో వర్షపునీరు చేరి ఈ పరిస్థితి నెలకొన్నట్టు యాజమాన్యం సర్ది చెప్పింది. ఆరేళ్ల కిందట ఇదే పరిస్థితి తలెత్తడంతో ఈ విషయం జిల్లా అధికారులకు వెళ్లడంతో తనిఖీలు చేశారు. ఈ మేరకు జరిమానాలు విధించారు. ఇప్పుడు డబ్బులు తిరిగి చెల్లించడంతో వాహనదారులు అధికారులకు ఫిర్యాదు చేయకపోవడంతో సమస్య సద్దుమణిగింది.